# పరాయి సిరా

అనువాద కథలు

## స్వేచ్ఛానువాదం–మల్లాది వెంకట కృష్ణమూర్తి



### చిన్నమాట

కథ అందరికీ నచ్చే సాహిత్య ప్రక్రియ. బాల్యం నించే మనిషికి కథలంటే ప్రీతి. అందుకే తెలుగులో వార, మాసపత్రికల్లో కథలు తప్పనిసరి. ఆఖరికి ఆదివారం అనుబంధాల్లో కూడా. కథా సరిత్సాగరం, కాశీ మజిలీ కథలు, పంచతంత్రం కథలు.... ప్రతి సంస్కృతికీ ఇలాంటి కథలున్నాయి. తెలుగు కథల నేపథ్యానికి విస్తృతి లేదు. ఈనాటికీ అవి ఎదగలేదు. ప్రేమ, కుటుంబం, జానపదం, హాస్యం, ఇంకా ఆఫీసు కథలు, కమ్యూనిస్ట్ కథలు, తెలుగు కథలు ఇలా కేవలం  పరిమిత ఇతివృత్తాల చుట్టూనే తిరుగుతున్నాయి.

కమ్యూనిజం, స్త్రీవాదం, దళితవాదం కథలని అతి గొప్ప కథలుగా చలామణి చేసే ప్రయత్నం  కొన్ని పదుల సంవత్సరాలుగా జరుగుతోంది. కథల పోటీల్లో అవార్డులుకూడా ఈ కథలకే వస్తూండడం కూడా మనం గమనించవచ్చు. ఈ మధ్య యువరచయితలనుంచి స్వలింగ సంపర్కం లాంటి జుగుప్సాకరమైన కథలు కూడా వస్తున్నాయి.

తెలుగులో 1950-1960లలో వెలువడ్డ కథలు ఈనాటికీ గుర్తుండిపోయే మంచి కథలు. ఆనాటి రచయితలు ఏ వాదానికీ కట్టుబడకుండా మానవ జీవితాల్లోని సున్నిత అంశాలతో కథలు రాసారు.

విదేశాల్లో, ముఖ్యంగా అమెరికా, యూరప్‌లలో కథా ఇతివృత్తం ఎంతో విస్తృతమైందని వారి పత్రికలు చదివాక నాకు అర్థమైంది. విపుల మాస పత్రిక ఆరంభించినప్పటినించి నేను వాటిని తెలుగులో అనువదిస్తున్నాను.

చిన్నప్పటినించి నాకు క్రైం కథలంటే ఇష్టం. ఆ రకం కథల ఇతివృత్తాలు కూడా ఎంతో విస్తృతమైనవి. హత్య, పరిశోధనే కాకుండా లాక్డ్ రూమ్ మిస్టరీస్, పజిల్స్, అతీంద్రియ కథలు, ట్విస్ట్ కథలు, హాస్యం, చరిత్ర, జానపద నేపథ్యం, కిడ్నాపింగ్, పగ, ప్రతీకారం, బ్లాక్ మెయిలింగ్ కథలు ఇంకా కిరాయి హంతకులు, వృద్ధులు, పిల్లలు, జంతువులు ప్రధాన పాత్రలుగాగల కథలు, రోడ్ కథలు, హృదయాన్ని స్పందింపచేసే కథలు... ఇలా వాటిలో ఎన్నో డివిజన్స్ ఉన్నాయి.

అలాంటి కథలని తెలుగు పాఠకులు ఈ నెలనించి కౌముదిలో నెలకి ఒకటి చదవగలరు. తెలుగు కథా వీధుల్లో లభ్యం కాని ఈ వినూత్న కథలు మిమ్మల్ని ఆనందింప చేస్తాయని ఆశిస్తూ ...

మీ మల్లాది వెంకట కృష్ణమూర్తి.

# కథ పేరు: పరాయి దేశంలో..

## { రాబర్ట్ వైట్లీ కథకి స్వేచ్ఛానువాదం}

**సార్జెంట్ థామస్** సిపోలో తీసుకువచ్చిన అతన్ని డిటెక్టివ్ గోల్డ్ స్టెయిన్ చూసాడు. వెనక్కి వున్న అతని చేతులకి సంకెళ్ళు వేసి ఉన్నాయి.

"ఈ చార్లీ చాంగ్ మీకు ఎక్కడ దొరికాడు?" గోల్డ్ స్టెయిన్ ప్రశ్నించాడు.

"ఛార్లీ చాంగ్? అతనెవరూ?" సిపోలో అడిగాడు.

"ఆ కుంగ్ ఫూ సినిమాల్లో నటించే నెంబర్ వన్ స్టార్."

"అది ఛార్లీ ఛాన్. తప్ప ఛాంగ్ కాదు. ఇతను ఛాన్‌లా చైనీస్ కాదు. నిప్."

"నిప్ అంటే?"

"నిపోనిస్. జపనీస్ తమ దేశాన్ని నిప్పన్ అంటారు. అవును కదా హోషీ?" సిపోలో ప్రశ్నించాడు.

హోషీ జవాబు చెప్పలేదు.

"ఇతని పేరు హోషీ టైకూ" సిపోలో చెప్పాడు.

హోషీ టైకూ అమెరికాకి వచ్చి మూడు రోజులే అయింది. అమెరికన్స్ ఎంత అనాగరికంగా మాట్లాడతారో అతనికి ఇంకా తెలీలేదు. ఒకప్పుడు గాడ్‌ని స్మరించేవారు. ఇప్పుడు అదే సందర్భంలో 'షిట్' (పెంట)ని స్మరిస్తున్నారు.

హోషీని మేడమెట్లు ఎక్కించి మొదటి అంతస్థులోని చిన్న ఇంటర్వ్యూ గదిలోకి తీసుకువెళ్ళారు. అక్కడ రెండు ఇనప కుర్చీలు ఉన్నాయి. ఒకటి నేలకి బిగించి వుంది. సిపోలో అతన్ని బిగించి ఉన్న కుర్చీలో కూర్చోపెట్టి బయటకి వెళ్ళాడు. ఐదు నిమిషాల తర్వాత గోల్డ్ స్టెయిన్ ఆ కిటికీలు లేని గదిలోకి వచ్చాడు. ఆ గది గోడలు లేత పసుపు రంగులో ఎంతో అందవిహీనంగా ఉన్నాయి. అనేక సంవత్సరాలుగా ఆ గోడల మీద బాగా మట్టి పేరుకుని వుంది. హోషీ సంకెళ్ళని తొలగించి గోల్డ్ స్టెయిన్ అడిగాడు.

"ఇప్పుడు బావుందా?"

నీలం రంగు సూట్‌లో ఉన్న హోషీ టైకూ మధ్య వయస్కుడు. అతని మొహంలో కొంత అమాయకత్వం కనిపిస్తోంది.

"మొట్టమొదట నేను మీకు మీ హక్కులని వివరించాలి. అర్థమైందా?"

హోషీ టైకూ జవాబు చెప్పలేదు.

"మీకు ఇంగ్లీష్ రాదన్నట్లు నటించకండి. మీరు బసచేసిన హోటల్‌లోని రిసెప్షనిస్ట్‌తో, టైగర్ లాంజ్‌లోని బార్ టెండర్‌తో, బార్ మెయిడ్ క్లారాతో కూడా ఇంగ్లీష్‌లో మాట్లాడారు. మీరు ఈ దేశంలో నేరస్థుడైనా మీకు కొన్ని హక్కులున్నాయి. నాతో మాట్లాడాలని లేకపోతే మౌనంగా ఉండే హక్కు మీకుంది. మీరు ఎప్పుడు కావాలంటే అప్పుడు లాయర్ని కూడా పిలిపించుకోవచ్చు. అందుకు మీ దగ్గర డబ్బు లేకపోతే కోర్టే మీ తరపున లాయర్ని నియమిస్తుంది. మీరు గుర్తుంచుకోవాల్సిందల్లా ఇప్పుడు మీరు ఏం మాట్లాడితే అది సాక్ష్యంగా కోర్టులో ప్రవేశపెడతాం."

"నన్ను మీరు అరెస్ట్ చేసారా లేక అనుమానం మీద ప్రశ్నిస్తున్నారా?" హోషీ ప్రశ్నించాడు.

"ఇంకా అరెస్ట్ చేయలేదు."

హోషీ ముందుగు వంగి అభివాదం చేసాడు.

"మీకు లాయర్ కావాలా? ఒకవేళ మేము మిమ్మల్ని అరెస్ట్ చేస్తే మీకు అతని అవసరం రావచ్చు."

"నేనే నేరం చేయలేదు. కాబట్టి నాకు లాయర్ అవసరంలేదు."

"ఐతే ఈ కాగితం మీద సంతకం చేయండి. దీన్ని మిరండా లైవర్ అంటారు."

అచ్చు వేసిన ఆ కాగితంలో సంతకం కోసం కేటాయించిన చుక్కల గీత మీద హోషీ ఇంగ్లీష్‌లో సంతకం చేసాడు.

తలుపు చప్పుడైంది. సార్జెంట్ సిపోలో లోపలకి వచ్చి చెప్పాడు.

"లెఫ్టినెంట్ నిన్ను తన ఆఫీస్ గదిలోకి రమ్మన్నాడు. నిన్న జరిగిన రెయిడ్ గురించి మాట్లాడడానికి."

"ఇప్పుడే రమ్మన్నారా" గోల్డ్ స్టెయిన్ అడిగాడు.

"ఇప్పుడు కాదు. పది నిమిషాల క్రితమే."

గోల్డ్ స్టెయిన్ కొద్ది నిమిషాల తర్వాత మళ్ళీ ఇంటర్వ్యూ గదిలోకి వచ్చేసరికి హోషీ పూర్వం ఎలా కూర్చున్నాడో అలాగే కూర్చుని శూన్యంలోకి చూస్తున్నాడు. అతని మొహం విషాదంగా ఉంది.

"నేను కాసేపటి తర్వాత నీతో ఇంటర్వ్యూ కొనసాగిస్తాను. లేచి నిలబడు. నీకు మళ్ళీ సంకెళ్ళు వేయాలి."

హోషీ చేతులని వెనక్కి విరిచి సంకెళ్ళు వేసి మెట్ల మీదనించి కిందకి తీసుకెళ్ళి, కొక్కానికి వేళ్ళాడే తాళం చెవుల గుత్తిని అందుకున్నాడు. హోషీని లాకప్ రూములో బంధించాడు. నాలుగు లాకప్ గదులలో ఇద్దరేసి చొప్పున ఖైదీలున్నారు.

ఆ లాకప్ రూములోని ఇద్దర్ని వేరే వాటాలోకి బదిలీ చేసి హోషీని ఒక్కడ్నే ఒక గదిలో పెట్టి గోల్డ్ స్టైన్ చెప్పాడు.

"జపాన్‌లో సంగతి నాకు తెలీదు కాని, ఇక్కడి ఖైదీలతో నీలాంటి అమాయకులని ఉంచితే ప్రమాదం తప్పదు."

పావుగంట తర్వాత అతను తిరిగి వచ్చి హోషీని లాకప్ గదిలోంచి బయటకి తీసుకెళ్ళేదాకా, మిగతా గదుల్లోని ఖైదీలు హోషీతో నానా చెత్తా మాట్లాడారు. ఆ ఇంగ్లీష్ స్లాంగ్‌లోని కొంత భాగం అతనికి అర్థం కూడా కాలేదు. వారు డ్రగ్ ఎడిక్ట్స్, హోమో సెక్స్‌వల్స్ అని హోషీ కొంతదాకా గ్రహించగలిగాడు.

అతను తను చిక్కుకున్న పరిస్థితి గురించి ఆలోచించాడు. క్యోటోలోని తన భార్యాపిల్లలు అతనికి గుర్తుకు వచ్చారు. తనని పోలీసులు అరెస్ట్ చేస్తే ఇరుగు పొరుగు వారిని వెలేస్తారు. తనని అరెస్ట్ చేసిన సంగతి మీడియా ద్వారా జపాన్‌లో అందరికీ తెలిసిపోతుంది. బహుశా తన ఉద్యోగం పోకపోయినా తనని కొలీగ్స్ పూర్వం చూసినంత గౌరవంగా చూడరు. హిరోషిమా, నాగసాకి మీద బాంబ్ చేసిన అనాగరికుల ప్రవర్తనలా ఉంది ఇతర ఖైదీల ప్రవర్తన అనుకున్నాడు.

గోల్డ్ స్టెయిన్ తనని భౌతికంగా హింసించడని హోషీకి అర్థమైంది. ఒకవేళ తనకి జైలు శిక్ష పడితే ఎలాంటివారి మధ్య తాను జీవించాలో తలుచుకుంటేనే అతనికి భయంగా వుంది.

ఓ పెట్రోల్ మేన్ ఓ ఆడ ఖైదీతో లోపలకి వచ్చాడు. హోషీ సెల్ తాళం తీసి చెప్పాడు.

"టైకూ. నువ్వు పైకి వెళ్ళు."

పెట్రోల్ మేన్ ఆమెని ఆ సెల్‌లో ఉంచి తాళం వేసాడు. మళ్ళీ హోషీ టైకూని గోల్డ్ స్టెయిన్ ఇంటర్వ్యూ గదిలోకి తీసుకు వెళ్ళాడు.

"నేను జపనీస్ పౌరుడ్ని. మీరు నన్ను వేరే సెల్‌లో ఉంచినందుకుకు నా కృతజ్ఞతలు." జపనీస్ పద్ధతిలో ముందుకు వంగి, తన కృతజ్ఞతలని తెలియచేసాడు.

"ఐయాం సారీ. ఇద్దరు సార్జెంట్స్, నేను ఆరునెలల నించి వెదికే రేరెంట్‌ని పట్టుకున్నారు. వాడిని ప్రశ్నించాల్సి వచ్చింది. అతనికి సహాయం చేసినవాడి ఇల్లు చూపించడానికి తీసుకెళ్ళాడు" గోల్డ్ స్టెయిన్ పెన్, పేడ్ తీసుకుని చెప్పాడు.

"మన మధ్య జరిగే సంభాషణ రికార్డవుతుంది" అతను రికార్డర్ బటన్ నొక్కాడు.

"మీరు జరిగింది మొదటినించి చెప్పండి. ఈ ఉదయం లేదా నిన్న రాత్రి మీ హోటల్ గదిలో ఏం జరిగిందో చెప్పండి."

హోషీ టైకూ దీర్ఘశ్వాస తీసి, తనకి వచ్చిన తక్కువ ఆంగ్ల పదాలని ఉపయోగించి జరిగింది చెప్పాడు. గోల్డ్ స్టెయిన్ అతని మొహం వంకే పరిశీలనగా చూస్తూండిపోయాడు.

"బార్ మెయిడ్ రాత్రి నా గదికి రావడానికి వందడాలర్లు అడిగింది. తన కొడుకు నాలుగో తరగతి స్కూల్ ఫీజ్ కట్టడానికి ఆ డబ్బు అవసరం ఉంది. తెల్లవారు ఝామున రెండు దాకా ఇద్దరం మేలుకునే ఉన్నాం."

"నువ్వు చెల్లించిన దానికి తగిన సరుకు లభించిందా?" గోల్డ్ స్టెయిన్ అడిగాడు.

హోషీ అర్థం కానట్లుగా చూసాడు.

"గర్ల్ ఓకే?"

హోషీ, టైకూ ఆ ప్రశ్నకి అదిరిపడ్డాడు. దాని జవాబు పరిశోధనకి ఉపయోగించదని అతనికి తెలుసు. జపాన్ పోలీసులు ఇలాంటి ప్రశ్నలని అడగరు.

"మా మధ్య సెక్స్ జరిగింది. ఉదయం నిద్రలేచాక ఆమె మంచం మీద లేదు. వెంటనే పేంట్ జేబులోని పర్స్, పాస్‌పోర్ట్, క్రెడిట్ కార్డులు తడుముకుని చూసుకున్నాను. ఆమె వాటిని ఎత్తుకెళ్ళిందని భయపడ్డాను. అవి కనపడటంతో ఆమె దొంగ కాదని అనుకున్నాను. నానించి వంద డాలర్లు తీసుకోకుండా ఎందుకు వెళ్ళిందా అని కూడా అనుకున్నాను."

"మీ ఇద్దరూ డ్రగ్స్‌ని వాడారా?"

"లేదు. నేనింతదాకా వాటిని వాడలేదు."

"తర్వాత?"

"నేను మంచం దిగి బాత్‌రూం తలుపు తెరిస్తే, ఎదురుగా నేలమీద క్లారా పడి ఉంది."

"క్లారా అంటే రాత్రి మీ గదికి వచ్చిన అమ్మాయేనా?"

"అవును."

"ఆమెని మీ గది బయటికి ఈడ్చుకెళ్ళి పడేస్తే అప్పుడు మీరిక్కడ ఉండేవారు కాదుకదా?" గోల్డ్ స్టైయిన్ ప్రశ్నించాడు.

"ఆమె నగ్నంగా ఉంది. అలా బయటకి ఎలా తీసుకెళ్ళగలను?"

ఆమెని హోషీ గౌరవించే తీరు గోల్డ్ స్టైయిన్‌కి కొద్దిగా ఆశ్చర్యం అనిపించింది. అమెరికన్స్ అయితే ఆ పనిచేసి ఉండేవారు అనుకున్నాడు.

"ఆమెకి దుస్తులు తొడిగి ఉండచ్చుగా?"

"జపాన్‌లో ఇలాంటి సందర్భంలో నేనే పనిచేసి ఉండేవాడినో అదే చేసాను. వెంటనే రిసెప్షన్‌కి ఫోన్ చేసాను. పోలీసులు వచ్చేదాకా ఆమె మరణించిందని కూడా నాకు తెలియదు" హోషీ చెప్పాడు.

"మీరామెని ఎందుకు చంపారు?" గోల్డ్ స్టైయిన్ అడిగాడు.

హోషీ తల అడ్డంగా ఊపాడు.

"నోటితో బదులు చెప్పండి. మీరామెని ఎందుకు చంపారు?"

"నేనింతదాకా ఎవర్నీ చంపలేదు. ఆమెని చంపాల్సిన అవసరం నాకు లేదు."

"కానీ క్రైం సీన్ చూస్తే ఆమె హత్య చేయబడిందనే తెలుస్తోంది. మీరు బాత్‌రూంని ఎందుకు కడిగారు?"

"ఆమె గదంతా వాంతి చేసుకుంది కాబట్టి."

"శవం మార్చురీలో ఉంది. డాక్టర్ రిపోర్ట్ వచ్చాక మిమ్మల్ని అరెస్ట్ చేయాలా? లేదా? అన్నది నిర్ణయిస్తాం."

"నన్ను అరెస్ట్ చేస్తే, నా దేశంలో నా జీవితమే మారిపోతుంది. అంతా నన్ను ఎంతో అనుమానంగా, అగౌరవంగా చూస్తారు నేనామెని చంపలేదు. నిజానికి ఆమె కొడుకు చదువుకి వీలైనంత ఎక్కువ సహాయం చేయాలని కూడా అనుకున్నాను" చెపుతూంటే హోషీ కంఠం వణికింది.

"మీరామెని చంపకపోతే అరెస్ట్ చేసినా నిర్దోషిగా కోర్టు విడుదల చేస్తుంది కదా?" గోల్డ్ స్టెయిన్ సూచించాడు.

"ఓ వేశ్యతో హోటల్ గదిలో గడపడం జపాన్‌లో ఓ గృహస్థుకి అవమానకరమైన విషయం. నిర్దోషిగా విడుదలైనా మా ప్రజల దృష్టిలో నేను దోషినే. ఎలాగో తప్పించుకున్నానని భావిస్తారు. దానికంటే ఆత్మహత్య మేలు."

"కానీ అది కూడా ఇక్కడ నేరమే."

"మా దేశంలో కాదు. ఒకవేళ శిక్షపడి విడుదలయ్యాక నేను తిరిగి జపాన్‌కి వెళ్ళలేను. ఇక్కడా జీవించలేను. నన్ను ఉండనివ్వరు. అలాంటప్పుడు ఆత్మహత్యే పరిష్కారం.. మీకు తెలుసో, తెలియదో జపాన్‌లో ప్రపంచంలో అన్ని దేశాల్లో కన్నా ఆత్మహత్యలు అధికం."

"కానీ మిమ్మల్ని ప్రశ్నించిన సంగతి దినపత్రికలో వస్తుంది కదా?" గోల్డ్ స్టెయిన్ ప్రశ్నించాడు.

"సాక్షులనే కదా ప్రశ్నించేది? నేను సాక్షిని అని చెపితే నమ్ముతారు. అరెస్ట్ చేస్తే ఆ పరిస్థితి వేరు."

"నేను కూడా మీలా ఆఫీస్ పని మీద ఇంకో దేశానికి వెళ్తే, డబ్బుంటే హోటల్ గదికి ఓ వేశ్యని తెప్పించుకుంటాను. అది తప్పనుకోను. కానీ, ఆమె నా గదిలో మరణిస్తే నాకు ఏమవుతుందో నేను అర్థం చేసుకోగలను. ఐయాం సారీ. మెడికల్ రిపోర్ట్ వచ్చేదాకా మీ పాస్‌పోర్ట్‌ని మా దగ్గరే ఉంచుతాం. మీరు మీ హోటల్ రూములోనే ఉండండి. పారిపోయే ప్రయత్నం చేయకండి."

ఆ రాత్రి గోల్డ్ స్టెయిన్ తన భార్యకి రోజూలా తను విచారించిన కేసుల గురించి చెపుతూ జపనీస్ పౌరుడి కేస్ గురించి కూడా చెప్పాడు. అతనికి హోటల్‌కి ఫోన్ చేసి, అతను గదిలో ఉన్నాడో, లేడో తెలుసుకున్నాడు. అతను పారిపోడని గోల్డ్ స్టెయిన్‌కి తెలుసు. పారిపోయి, ఇంగ్లిష్ సరిగా రాక, బంధుమిత్రులు ఎవరూ లేని దేశంలో ఎలా బ్రతకగలడు?

మర్నాడు ఉదయం ఆశ్చర్యంగా డిటెక్టివ్ గోల్డ్ స్టెయిన్ దగ్గరకి హోషీ వచ్చాడు.

"మెడికల్ రిపోర్ట్ వచ్చిందా?" ఆదుర్దాగా అడిగాడు.

"రాత్రి మీరు నిద్రపోలేదా?" గోల్డ్ స్టెయిన్ ప్రశ్నించాడు.

"ప్రయత్నించాను. కానీ నిద్రపట్టలేదు. జపనీస్ ఎంబసీ నించి వచ్చిన టెలిఫోన్ కాల్‌ని కూడా నేను రిసీవ్ చేసుకోలేదు."

మధ్యాహ్నంకి కాని ఆ రిపోర్ట్ రాలేదు. దాని కవర్ తెరుస్తూంటే హోషీ ఊపిరి బిగపట్టి చూసాడు. దాన్ని చదివిన గోల్డ్ స్టెయిన్ మొహంలోని చిరునవ్వుని చూసాక మొదటిసారిగా హోషీ మొహం కొద్దిగా తేటపడింది.

"డ్రగ్స్ అధికంగా తీసుకోవడంతో క్లారా మరణించిందని లింకన్ సెంటర్ రిపోర్ట్ చెప్తోంది. ఆమె కొడుకుని ప్రొటెక్టివ్ కష్టడీలోకి తీసుకుని ఫాస్టర్ హోంకి తరలించాలి. మీరు నిర్దోషి."

హోషీ గౌరవ సూచకంగా ముందుకి వంగి అభివాదం చేసాడు.

**(వచ్చేనెల మరో కథ)**